# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించే ప్రయత్నాలను కొనసాగిస్తామని భారత్, యూఏఈలు స్పష్టం చేశాయి.
- ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ ఆవిర్భవిస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.
- ఆహార భద్రతను బలోపేతం చేయడంతో పాటు వ్యవసాయం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- దేశం గత పన్నెండేళ్ళ కాలంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించే ప్రయత్నాలలో సహకారం, సమన్వయం కొనసాగించడానికి భారత్, యూఏఈలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తో టెలిఫోన్ ద్వారా ఈ రోజు చర్చలు జరిపారు. పశ్చిమాసియాలోని పరిణామాలపై ఇరువురు నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఇంధనం, రక్షణ, సాంకేతికత, పెట్టుబడులు, ఆరోగ్యం వంటి రంగాలతో సహా భారత్-యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై కూడా ఇరు దేశాల నాయకులు చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమలో విశ్వసనీయ భాగస్వామిగా భారతదేశం ఆవిర్భవిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన `సెమికాన్ ఇండియా-2026`లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న పదేళ్లలో 85 వేల మంది సెమీకండక్టర్ డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఇప్పటికే నాలుగేళ్లలో 70 వేల మందికి శిక్షణ ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ రంగం లక్షకు పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా వేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు తెలియచేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. హర్యానాలోని సోనిపట్‌లో `చట్టం విధానం- సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ` అనే అంశంపై ఈరోజు జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేందమంత్రి మాట్లాడుతూ... ఆలోచనలు, సంస్కృతి, ఆవిష్కరణలు, మేధో సంపత్తి ద్వారా ఈ అభివృద్ధి జరుగుతోందన్నారు. సినిమాలు, సంగీతం, గేమింగ్, యానిమేషన్, డిజైన్, పబ్లిషింగ్, అడ్వర్టైజింగ్, డిజిటల్ కంటెంట్ వంటి రంగాలు ఉద్యోగాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత వంటి రంగాలలో దేశం గణనీయమైన ప్రగతిని సాధించిందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సేవా సంకల్ప్ అభియాన్` కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... గత పన్నెండేళ్ళ కాలంలో భారతదేశం అనేక విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మారుమూల సరిహద్దు ప్రాంతాలకు సైతం ఇప్పుడు మోటారు వాహనాల ద్వారా సులువుగా చేరుకోవచ్చునని కేంద్రమంత్రి చెప్పారు. అలాగే 80 కోట్లకు పైగా ప్రజలు ఉచితంగా ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులను పొందుతున్నారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కిరణ్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు నితిన్ నబిన్ బీహార్ వరద సహాయ నిధికి మూడు నెలల జీతం 6 లక్షల 35 వేల రూపాయలను విరాళంగా అందించారు. బీహార్‌లో వరద పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని సామాజిక మాధ్యమ పోస్టులో ఆయన పేర్కొన్నారు. రైతుల పంట నష్టాన్ని అంచనా వేసి అవసరమైన సహాయం అందించే ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడం, వ్యవసాయం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ లక్ష్యాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈ రోజు జరిగిన `దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వ్యవసాయ సదస్సు`లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతుల ఆదాయం పెంపుతో పాటు వ్యవసాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఆహార భద్రత, రైతుల జీవనోపాధి, పోషకాహార భద్రత వంటివి వ్యవసాయ రంగంలో మూడు కీలకమని చెప్పారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇతర ఆధునిక

సాంకేతికతలు ప్రపంచాన్ని ఎంతగా మార్చినప్పటికీ.. వ్యవసాయం మాత్రం ఎప్పటికీ అత్యవసరమైనదిగా ఉంటుందని కేంద్రమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో అమరావతి సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య అవగాహన ఒప్పందం ఈరోజు జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు 15 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =

శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను మెరుగుపరచడంలో యోగా సహాయపడుతుందని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. మహారాష్ట్రలోని లోనావాలాలో గల కైవల్యధామంలోని గోర్ధన్‌దాస్ సెక్సరియా కాలేజ్ ఆఫ్ యోగా అండ్ కల్చరల్ సింథసిస్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… యోగా కేవలం ఒక తరానికి చెందిన సంప్రదాయం కాదని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం దీనిని పరిరక్షించాల్సిన వారసత్వ సంపదగా ఆయన అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం ద్వారా యోగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందని ఉపరాష్ట్రపతి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

`పర్యావరణం, వాతావరణ గతిశీలత భవిష్యత్" అనే అంశాలపై న్యూఢిల్లీలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును జాతీయ హరిత ట్రిబ్యునల్ నిర్వహిస్తోంది. ఇందులో పర్యావరణ నిపుణులు, సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు, జిల్లా కోర్టు న్యాయమూర్తులు పాల్గొంటారు. వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నత ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో 20వ `రోజ్‌గార్ మేళా`లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో కొత్తగా నియమితులైన 51 వేల మందికి నియామక పత్రాలను న్యూఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పంపిణీ చేయనున్నారు. ఈ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. కొత్తగా నియమితులైన అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ మంత్రిత్వ శాఖల్లో చేరనున్నారు. వీటిలో రెవెన్యూ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, రక్షణ మంత్రిత్వ శాఖ వంటివి ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం, కేరళం, రాజస్థాన్‌లలో ఈ రోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేసింది. ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, కొంకణ్, గోవా, కర్ణాటక, లక్షద్వీప్‌లలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

రాబోయే రెండు రోజులలో తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళం, మాహే, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉంటాయని ఐఎండి అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =